క్లుప్తంగా

ఉద్దానం కీర్తి ప్రతిష్టలు నిలపాలి


యువకులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: దేశసేవ కోసం నిర్వహించిన అగ్నివీర్ ఉద్యోగ పరీక్షలో విజేతలుగా నిలిచిన యువత దేశసేవలో సమున్నతమైన సేవలందించి కవిటి ఉద్దానం కీర్తిపతాకాన్ని ఎగురవేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. కొత్తపుట్టుగలో జగద్గురు యువజన సంఘం ఆధ్వర్యంలో అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికైన యువకులు నర్తు సింహాద్రి, కాళ్ల కృష్ణలను శుక్రవారం ఘనంగా సత్కరించారు. మీరు సాధించిన విజయం వర్ధమాన యువతకు ప్రేరణగా నిలుస్తుందని ఉపాధ్యాయుడు నర్తు సోమేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు మామిడి సంతోష్, కార్యదర్శి నాగరాజు, వైఎస్సార్‌సీపీ నేత నర్తు అశోక్, సప్ప శ్రీను, నర్తు శీతయ్య ఉన్నారు.

తెలంగాణ డీఎస్సీలో మెరిసిన తారకేశ్


బుడ్డెపు తారకేశ్

కంచిలి: బురదపాడు గ్రామానికి చెందిన బుడ్డెపు తారకేశ్ తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లాలో ఎస్జీటీలో 9వ ర్యాంకు సాధించాడు. ఈ సమాచారం అందిన వెంటనే రిపోర్ట్ చేయడానికి తారకేశ్ తెలంగాణకు బయలుదేరి వెళ్లాడు. తమ కుమారుడు సాధించిన విజయానికి తల్లిదండ్రులు చంద్రశేఖర్, నీలమ్మలు హర్షం వ్యక్తం చేశారు. తారకేశ్ హైస్కూల్ విద్యను మఠం సరియాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియెట్‌ను కంచిలిలోని క్రిష్ణసాయి జూనియర్ కళాశాల, డైట్‌ను రాజమండ్రి పట్టణ పరిధి బొమ్మూరి కళాశాలలో పూర్తిచేశారు. తారకేశ్ తండ్రి చంద్రశేఖర్, తల్లి నీలమ్మలు వ్యవసాయం చేస్తుంటారు. తమ కుమారుడు శ్రమకు తగిన ఫలితం లభించడంతో తారకేశ్ కుటుంబం సంతోషం వ్యక్తంచేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు బొడ్డపాడు విద్యార్థి


సాహిల్ కుమార్

పలాస: బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మితో తరగతి విద్యార్థి రాపాక సాహిల్ కుమార్ రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్‌లో తలపడనున్న జట్టులో స్థానం సంపాదించినట్టు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సి.హెచ్.ఆర్.రామ్‌జీ శుక్రవారం తెలిపారు. గత ఏడాది కూడా విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సాహిల్ కుమార్ పాల్గొన్నాడు. ప్రధానోపాధ్యాయుడు ఎ.వీర్రాజు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

రతన్‌టాటాకు ఘనంగా నివాళి


రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీష తదితరులు

కాశీబుగ్గ: భారతదేశం కోసం తన సంపాదనలో సగానికి ఎక్కువ కేటాయించిన మహామనిషి టాటా గ్రూప్ చైర్మన్ రతన్‌టాటా అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాసలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, మల్లా శ్రీనివాసరావు, దువ్వాడ శ్రీకాంత్, సప్ప నవీన్, టంకాల రవిశంకర్‌గుప్తా, గాలి క్రిష్ణారావు, యవ్వారి మోహనరావు, చంద్రమౌళి పాల్గొన్నారు.

పోలవరం యువకుడికి డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకున్న వెంకటేష్

టెక్కలి: పోలవరం గ్రామానికి చెందిన ధవళ వెంకటేష్‌కు సౌత్ వెస్ట్రన్ అమెరికా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ మేరకు అవార్డు గ్రహీత శుక్రవారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఇటీవల చెన్నైలో జరిగిన గ్లోబల్ అచీవర్స్ కౌన్సిల్ కార్యక్రమంలో భాగంగా సోషల్ వర్క్ విభాగానికి సంబంధించి డాక్టరేట్ వరించినట్టు పేర్కొన్నారు. పోలవరం గ్రామస్తులు వెంకటేష్‌ను అభినందించారు.

మార్కెట్‌కు దసరా కళ


టెక్కలిలో అలంకరణ వస్తువుల దుకాణం


టెక్కలి చిన్నబజారులో విక్రయానికి సిద్ధంగా నాటుకోళ్లు


ఇచ్ఛాపురం: పండ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు


ఇచ్ఛాపురం: పూజా సామగ్రి కొనుగోలు చేస్తూ..


కంచిలిలో పూజా సామగ్రి విక్రయ స్టాల్


కాశీబుగ్గ: రిక్షాపై కలువ పువ్వుల అమ్మకాలు


కాశీబుగ్గ: ప్లాస్టిక్ దండలు అమ్ముతున్న ముస్లిం సోదరుడు

మార్కెట్‌కు దసరా కళ వచ్చింది. శనివారం విజయదశమి సందర్భంగా దుర్గామాతకు, వాహనాలకు పూజలు చేసేందుకు కావాల్సిన సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో మార్కెట్లన్నీ శుక్రవారం రద్దీగా మారాయి. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారంతా పూజా సామగ్రి, ఇతర అలంకరణ వస్తువులు కొనుగోలు కోసం రావడంతో పట్టణ మార్కెట్లు కిటకిటలాడాయి. అలంకరణ వస్తువులు, పువ్వులు, పండ్ల ధరలు అమాంతం పెరిగినప్పటికీ సంప్రదాయం ప్రకారం జనం కొనుగోలు చేశారు. నాటుకోళ్లకు డిమాండ్ పెరిగింది.

మనసాస్మరామి..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన శుక్రవారం దుర్గాదేవి అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహానవమి సందర్భంగా భక్తులు భారీగా మండపాలు, ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారికి వివిధ పిండివంటలతో నైవేద్యం సమర్పించారు. పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.


వజ్రపుకొత్తూరు: పూండిలో పూజలందుకున్న మహిషాసురమర్దిని


సంతబొమ్మాళి: సీతానగరంలో కుంకుమ పూజల్లో మహిళలు


కవిటి: రాజపురంలో సామూహిక కుంకుమార్చనల్లో భక్తులు


పలాస: రెంటికోటలో దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే గౌతు శిరీష


ఇచ్ఛాపురం రూరల్: తులసిగాంలో మహిషాసుర మర్దిని అవతారంలో పెద్దదేవి అమ్మవారు


సోంపేట: మహిషాసుర మర్దిని అవతారంలో సోంపేట సోమపోలమాంబదేవి


సోంపేట: మహిషాసుర మర్దిని అవతారంలో బారువ కనకదుర్గమ్మ


టెక్కలి చిన్నబజారులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు


ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారికి మహానైవేద్యంగా భక్తులు సమర్పించిన 225 రకాల వంటకాలు

40 ఏళ్లుగా సరస్వతీ పూజ


ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో కొలువైన శారదా మాత


కంచిలి: సరస్వతీదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తేలుకుంచి గ్రామంలో 40 ఏళ్లుగా శారదా సప్తరాత్రుల పేరిట సరస్వతీ దేవి మహోత్సవాలు జరుపుతున్నారు. ఈ ఏడాది 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామంలో పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మికత సంతరించుకుంది. రోజూ సంగీత కళాకారులతో కచేరీ కార్యక్రమంతో పాటు రాత్రి సమయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు.

సరస్వతీదేవిని దర్శించుకొన్న ఎమ్మెల్సీ

కంచిలి: బూరగాంలో సరస్వతీ పూజ ఘనంగా జరుగుతోందని. ఎమ్మెల్సీ నర్తు రామారావు సరస్వతీదేవిని దర్శించుకొని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి కృష్ణారావు, స్థానిక నేతలు మద్దిలి భీమారావు, మద్దు వెంకటేశ్వరరావు, మద్దు వెంకటరావు, పిల్లల లింగరాజు ఉన్నారు.

స్నేహితుడికి అండగా..


కవిటి: నాగభూషణం కుటుంబానికి సాయాన్ని అందజేస్తున్న స్నేహితులు


సంతబొమ్మాళి: సహదేవ్‌కు మందులను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కవిటి: కవిటి ఎస్‌వీజే కళాశాలలో 2007-2010 విద్యా సంవత్సరంలో పొల్లాయిమండల నాగభూషణం చదువుకున్నాడు. ఇతను ప్రస్తుతం అనారోగ్యానికి గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న స్నేహితులు అండగా నిలిచారు. మిత్ర బృందాలకు వాట్సాప్ ద్వారా విషయాన్ని తెలియజేసుకున్నారు. స్పందించిన స్నేహితులంతా రూ.45 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని నాగభూషణం కుటుంబానికి శుక్రవారం అందజేసి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో సావాడ గణేష్‌రెడ్డి, లండ నరేష్, మామిడి బాబూరావు, నర్తు ధర్మతేజ, మల్ల పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

స్పందన ఫౌండేషన్ సహాయం

సంతబొమ్మాళి: బడేకుప్పన్నపేట గ్రామానికి చెందిన కేపీ స్పందన ఫౌండేషన్ కోటబొమ్మాళి మండలం సోమనాధపురం గ్రామానికి చెందిన బొడ్డాపు సహదేవ్‌కు అండగా నిలిచింది. సహదేవ్ మూడు నెలలుగా చర్మవ్యాధితో బాధపడుతున్నాడు. తిండి లేక, వైద్యం చేయించుకునే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఆ గ్రామానికి చెందిన యువకుడు రామారావు స్పందన ఫౌండేషన్ ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన సభ్యులు శ్రీకాకుళంలోని ఓ చర్మవ్యాధి వైద్యునికి వద్దకు సహదేవ్‌ను తీసుకొని వెళ్లి చికిత్స అందించారు. మూడు నెలలకు సరిపడా పది వేల రూపాయల విలువైన మందులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు షణ్ముఖరావు, సిమ్మన్న, రామారావు పాల్గొన్నారు.

మురుగు సమస్య లేకుండా ప్రక్షాళన చేస్తాం

- మంత్రి అచ్చెన్నాయుడు


శ్రీనివాసానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో మురుగు సమస్య లేకుండా ప్రక్షాళన చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. పంచాయతీ పరిధి శ్రీనివాసానగర్, తొలుసూరుపల్లి రోడ్డులో అధ్వానంగా ఉన్న మురుగు కాలువలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో మురుగు వ్యవస్థతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈయనతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కె.లవకుమార్, కార్యకర్తలు ప్రసాద్‌రెడ్డి, ప్రీతీష్, బాలకృష్ణ, మురళీ ఉన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను కలిసిన న్యాయవాదులు


లక్ష్మీనారాయణను కలిసిన న్యాయవాదులు

టెక్కలి: ఏపీ ప్రభుత్వం తరఫున హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మెండ లక్ష్మీనారాయణను టెక్కలి బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు లక్ష్మీనారాయణ సొంత గ్రామం సంతబొమ్మాళి మండలం కృష్ణచంద్రాపురం గ్రామానికి చేరుకుని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా టెక్కలి కోర్టు సముదాయాల నిర్మాణం విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.వివేకానంద, కార్యదర్శి ఎస్.దివాకర్‌తో పాటు సభ్యులు పి.సాయిరాజు, పి.ఆనంద్ కోరారు.

బాలల సంరక్షణపై అవగాహన


బాలల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: బాలల సంరక్షణ అందరి బాధ్యతని పలాస రైల్వే చైల్డ్ హెల్ప్ డెస్క్ టీం ప్రతినిధులు అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పలాస రైల్వేస్టేషన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల రక్షణ, బాలలపై జరుగుతున్న లైంగికదాడుల నిర్మూలన, కిడ్నాప్‌లు, లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. బాలల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బాలలకు ఎటువంటి కష్టం వచ్చినా 1098 కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ, చైల్డ్ హెల్ప్‌డెస్క్ సిబ్బంది, వెండర్స్, ప్రయాణికులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమావేశం రేపు

టెక్కలి: మాజీ సైనికుల సంక్షేమ సంఘ సమావేశం టెక్కలిలో ఆదివారం జరగనుంది. ఈ విషయాన్ని సంఘ అధ్యక్షుడు గొనప సోమేశ్వర్రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్‌టీఆర్ కాలనీలోని సంఘ భవనంలో ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం


తేజకు సాయాన్ని అందజేస్తున్న స్నేహితులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని బలియాపుట్టుగ కాలనీలో నివాసం ఉంటున్న గుడియా తేజ నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు రూ.పది వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని తేజకు శుక్రవారం అందజేశారు. స్నేహితులు కడమటి రాము, లింగం కేశవరావు, సాలిన భీమారావు, గుడియా సోమేష్, గుడియా చంటి, గుడియా సునీల్ ఉన్నారు.

కేంద్రం వైఖరి మారాలి

కాశీబుగ్గ: నిరుద్యోగుల విషయంలో కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ వైఖరి మారాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ప్రధానమంత్రి తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే 'నౌకరీ దేవ్ నాషా' పేరుతో ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కాశీబుగ్గలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ నాయకులు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్, డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, తంగుడు వీర్రాజు, కేదారిపురం క్రిష్టారావు ఉన్నారు.

తైక్వాండో క్రీడాకారుల ప్రతిభ

టెక్కలి: ఈ నెల ఆరో తేదీ నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో టెక్కలి ఎన్‌టీఆర్ క్రీడా వికాస కేంద్రానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపారు. ఈ మేరకు కోచ్ శేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14 బాలికల 29 కేజీల విభాగంలో మెండ తపస్వీ, అండర్ -17 బాలికల 55 కేజీల విభాగంలో పులిబంద జాస్విక స్వర్ణ పతకాలను సాధించగా.. అండర్ -14 బాలుర 29 కేజీల విభాగంలో ఎస్.మోహిత్ రజత పతకం సాధించాడు.

ప్రణవి కళాశాలలో సైన్స్ పీజీ కోర్సులకు అనుమతి

టెక్కలి: పాతనౌపడ సమీపంలోని ప్రణవి డిగ్రీ కళాశాల దూర విద్యా కేంద్రానికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సైన్స్ పీజీ కోర్సులకు అనుమతులు లభించాయి. ఈ విషయాన్ని కళాశాల చైర్మన్ డాక్టర్ పి.పరమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం పీజీ ఆర్ట్స్ గ్రూపులు నిర్వహిస్తున్నామని.. తాజాగా ఎంఎస్సీ గణితం, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ సైన్స్, సైకాలజీ, స్టాటిస్టిక్స్, మైక్రో బయాలజీ కోర్సులకు అనుమతులు లభించినట్లు చెప్పారు. కళాశాల డైరెక్టర్ పి.చంద్రశేఖర్ ఆజాద్, ప్రిన్సిపాల్ కె.రుక్మాంధరరావు ఉన్నారు.

జనంలోకి పోస్టల్ సేవలు


జనంలోకి మనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

ఇచ్ఛాపురం: పోస్టల్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు 'జనంలోకి మనం'అనే కార్యక్రమాన్ని స్థానిక తపాలాశాఖ సిబ్బంది శుక్రవారం నిర్వహించారు. పట్టణంలో గ్రామీణ తపాల జీవిత బీమా, పొదుపు ఖాతాల మేళాలో భాగంగా ప్రజల మధ్యలో ఈ కార్యక్రమాన్ని డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ నక్క శ్రీకాంత్, స్థానిక పోస్టల్ సబ్‌పోస్ట్‌మాస్టర్ జ్ఞానవతి పర్యవేక్షణలో చేపట్టారు.

కేటీరోడ్డులో స్తంభించిన ట్రాఫిక్


కాశీబుగ్గ కేటీరోడ్డులో నిలిచిపోయిన వాహనదారులు


కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కేటీ రోడ్డులో శుక్రవారం రాత్రి ట్రాఫిక్ స్తంభించింది. దసరా నేపథ్యంలో జనమంతా రోడ్లపైకి చేరడంతో సమస్య తలెత్తింది. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. పాతజాతీయ రహదారి, కేటీరోడ్డు, సంతమైదానం, బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

బ్రహ్మోత్సవాల్లో అలరించిన నృత్యకారులు


ప్రదర్శన ఇస్తున్న నృత్యకారులు

ఇచ్ఛాపురం: తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన నృత్యకారులు అలరించారు. పట్టణానికి చెందిన శ్రీవెంకటేశ్వర డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ, స్వేచ్ఛా నృత్యతరంగిణి కూచిపూడి భరతనాట్యం జానపద శిక్షణాలయానికి చెందిన 44 మంది చిన్నారులు గురువారం సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

శ్రీశ్రీశ్రీ సద్గురు సాయిబాబా వారి
106వ పుణ్యతిథి ఆహ్వానము
శ్రీశ్రీశ్రీ షిరిడి సాయిబాబా మందిరం
షిర్డీసాయి నగర్ (శివాజీ నగర్), పలాస



శ్రీ సద్గురు సాయిబాబా మహారాజ్ మహాసమాధి
చెందిన రోజు విజయదశమి కావున
తేది: 12.10.2024 శనివారం నాడు
మందిర ప్రాంగణంలో
ఉదయం నుండి విశేష పూజలు ఆలయ ప్రధాన అర్చకులు
శ్రీ ధర్మపురి వాయునందన శర్మ గారు
నిర్వహించెదరు
ఉదయం 10 గంటలకు అన్నాభిషేకం మందిరమునకు వచ్చిన భక్తులందరి చేతుల మీదుగా జరుగుతుంది.
మధ్యాహ్నం 11.30 గంటలకు అన్నప్రసాదం నిర్వహించడం జరుగుతుంది.
ఉదయం 6 గంటల నుండి ఏకనామ సంకీర్తన ఏకాహము ..
ఓం సాయి... శ్రీసాయి.. జయజయసాయి...
(అందరి భక్తుల ఏకకంఠంతో స్మరణ)



ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో పలాస నియోజకవర్గ పరిసర ప్రాంత భక్తులంతా పాల్గొని ఆ స్వామివారి ఆశీస్సులు పొంది విజయవంతం చేయగలరని కోరుకుంటూ..
దువ్వాడ శ్రీధర్ (బాబా)
శ్రీ షిర్డీసాయిబాబా మందిరం
పలాస, సెల్: 9347684777

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com